# సంపూర్ణ సమర్పణత - 4

**1. నషా –** ఒక్క బాబాయే నా ప్రపంచము... నేను బాబా వాడిని, బాబా నావారు...

– 'ఇప్పుడు స్మృతి సబ్జెక్టులో, అనేక జన్మల వికారాలను వినాశనం చేసుకోవడంలో అటెన్షన్ పెట్టండి. **బాబాయే నా ప్రపంచము అని పక్కా చేసుకోండి.' – బాప్‌దాదా**

– బాబా ఎప్పుడూ ఇలా చెప్తూ ఉంటారు, ప్రపంచంలోనే అన్నీ ఇమిడి ఉంటాయి. ఈ ప్రపంచం బయట మరో ప్రపంచమేమీ లేదు. కనుక ఒకవేళ బాబాయే ప్రపంచం అన్నప్పుడు నా సర్వ సంబంధాలు మరియు సర్వ ప్రాప్తులు ఒక్కరితోటే ఉన్నాయా లేక లౌకిక ప్రపంచంలోకి కూడా బుద్ధి వెళ్తుందా అని పరిశీలించుకోండి.

## 2. యోగాభ్యాసం –

బాబాతో మనం చేసిన ప్రతిజ్ఞ – మీతోటే తింటాము, మీతోటే ఆడుకుంటాము, మీతోటే కలిసి నాట్యం చేస్తాము, మీతోటే ప్రతి క్షణం ఉంటాము... చేసిన ప్రతిజ్ఞ అనుసారంగా ఇప్పుడు ప్రతి క్షణం, ఉదయం నుండి రాత్రి పడుకునేవరకు... బాబాతోటే ఉందాము...

- **లేవగానే –** బాప్‌దాదా నా ఎదురుగా ఉన్నారు. వారు తమ ఆశీర్వాద హస్తాన్ని నా తలపై పెట్టి నాకు వరదానాన్ని ఇస్తున్నారు – నా పిల్లలూ! విజయి భవ... విజయి భవ... విజయి భవ...
- **యోగంలో –** బాబా నాతో ఐదు స్వరూపాల డ్రిల్‌ను చేయిస్తున్నారు...
- **స్నానం చేస్తూ –** నేను బాబాపై నీళ్ళు పోస్తున్నాను, బాబా నాపై నీళ్ళు పోస్తున్నారు...
- **అద్దం చూసుకుంటూ –** నా ముఖంలో బాబా మూర్తి కనిపించాలి. అందరికీ నేను కాక బాబా కనిపించాలి...
- **బట్టలు మార్చుకుంటూ –** బాబా, ఒకసారి మెరుస్తూన్న ఫరిశ్తా డ్రెస్ తొడిగితే మరోసారి దేవతా డ్రెస్‌ను తొడుగుతున్నారు...
- **ఆడుకుంటూ లేక వ్యాయామం చేస్తూ –** బుద్ధితో జ్యోతిర్బిందువైన బాబాను పట్టుకోవడము...
- **మురళి వింటూ –** మురళి వినిపించడానికి బాబా పరంధామం నుండి అవతరించారు, అలాగే నేను కూడా ఈ దేహంలోకి అవతరించాను మురళి వినడానికి – మురళి వింటూ ఈ విషయాన్ని 5 సార్లు గుర్తుకు తెచ్చుకోండి...
- **భోజనం చేస్తూ –** నేను బాబా ఒడిలో ఉన్నాను... బాబా తమ చినరాజాకు తమ స్వహస్తాలతో భోగ్ పెడ్తున్నారు...
- **నీళ్ళు, టీ, పాలు త్రాగుతూ –** బాబా నాకు వతనంలో అమృతం త్రాగిస్తున్నారు...
- **ఫోన్ గంట వింటూ –** బాబా అడుగుతున్నారు – పిల్లలూ, ఎక్కడున్నారు? ఏమి చేస్తున్నారు? నా స్మృతిలో ఉన్నారా?

ఈ విధంగా ప్రతి కర్మలోనూ బాబాను తోడుగా పెట్టుకోండి...

## 3. ధారణ - సంపూర్ణ సమర్పణత

– రాయి తనను తాను శిల్పకారుడికి సమర్పించుకున్నప్పుడే పూజ్యనీయంగా అవ్వగలదు. మట్టి తనను తాను కుమ్మరివాడికి సమర్పించుకున్నప్పుడే సుందరమైన కుండగా నిర్మింపబడుతుంది. మనం కూడా ఎప్పుడైతే ఒక్కరికే సమర్పణ అవుతామో అప్పుడే దర్శనీయమూర్తిగా అవుతాము.

## 4. స్వచింతన -

– నేను బాబాను ఎంతవరకు నా ప్రపంచంగా చేసుకున్నాను? బాబా కాకుండా ఇంకెవరెవరు నా ప్రపంచంలో ఉన్నారు?

– ఒక్క బాబానే సంపూర్ణ రూపంలో నా ప్రపంచంగా చేసుకోవడం ఎలా?

**5. తపస్వీల కొరకు –** ప్రియమైన తపస్వీకుల్లారా! మన దగ్గర ఉన్నదంతా ప్రభు ప్రసాదమే. ఏ గుణాలు, శక్తులు మరియు విశేషతల కారణంగా మనకు పేరు, మర్యాద వస్తున్నాయో, వాటిని మనకు ఈశ్వరుడు విశ్వ సేవ కోసం ప్రసాదించారు. వీటిలో 'నేను', 'నాది' రానివ్వకండి – నా కారణంగా ఈ సేవ జరిగింది, నేనింత గుణవంతుడిని మొ॥నవి. బాబా మనకు అన్నీ ఇచ్చారు, ఇలా చింతన చేస్తూ మనసులో బాబాకు కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఉండాలి. 'నేను' అన్న పదం వచ్చినప్పుడల్లా 'నేను ఆత్మను' అని గుర్తు చేసుకోండి, 'నాది' అని వచ్చినప్పుడల్లా నాకైతే కేవలం 'ఒక్క బాబా' అని గుర్తు చేసుకోండి.